https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 356 మంగళవారం 7-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# చురుగ్గా జమిలి, పౌరస్మృతి..

**అమలు దిశగా ముందడుగు వేస్తాం**

**బీజేపీ 47వ వార్షికోత్సవంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**

**వాటిపై జోరుగా చర్చలు జరుగుతున్నాయని వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 :** బీజేపీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం-ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా చురుగ్గా అడుగులు పడుతున్నాయని ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ అంశాలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయని, వాటిలో సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని చెప్పారు. బీజేపీ 47వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలతో ఆయన సోమవారం వర్చువల్‌గా మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లను 1994లోనే బీజేపీ లేవనెత్తిందని ప్రధాని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం వారికి 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలయ్యేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు.. వంటి ఎన్నో అణచివేతలను బీజేపీ కార్యకర్తలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా... దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి బీజేపీ కట్టుబడి ఉందని వివరించారు. "బ్రిటీష్ కాలంనాటి వందలాది నల్ల చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంటు భవనాన్ని నిర్మించుకొన్నాం.. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపట్టాం." అని తెలిపారు. ఇటువంటివి ఎన్నో బీజేపీ వల్లనే జరిగాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలామంది వాదించారని... కాని రద్దు చేసి చూపించామని అన్నారు. గత ప్రభుత్వాల్లా కాకుండా.. దేశమే ప్రధానంగా బీజేపీ పాలన సాగిస్తోందని ప్రధాని చెప్పారు. బీజేపీ రాకతో దేశ రాజకీయాల్లో మార్పు వచ్చిందని... అధికారమే లక్ష్యంగా ఒకవైపు రాజకీయాలు సాగుతుండగా... సేవే లక్ష్యంగా మరోవైపు తమ రాజకీయాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఒక కుటుంబం కోసమే కాంగ్రెస్ పనిచేస్తోందని ఆయన విమర్శించారు. అందుకు భిన్నంగా బీజేపీలో అందరికీ సమాన గౌరవం, ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొన్నారు. పార్టీని కార్యకర్తలు తల్లిగా భావిస్తారని తెలిపారు. అందువల్లే పార్టీ వార్షికోత్సవం వారికి ఒక భావోద్వేగ అంశమన్నారు.

# రాక్షసులను మళ్లీ రానివ్వం

- గత ప్రభుత్వ హయాంలో భార్యాభర్తలూ మాట్లాడుకునే పరిస్థితి ఉండేది కాదు
- ఇప్పుడు ప్రజలంతా స్వేచ్ఛగా బతుకుతున్నారు
- 6 గ్యారెంటీల్లో కొన్ని అమలు.. దశలవారీగా అన్నీ
- తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల నిర్మిస్తాం
- పిప్రి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఆదిలాబాద్, ఏప్రిల్ 6**
"ఆనాడు నిజాం ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ బిడ్డలు రాంజీ గోండు, కుమ్రం భీం గడీలను బద్దలు కొట్టారు. అదే గడ్డపై నుంచి చెబుతున్నా.. మళ్లీ గడీల పాలన రానివ్వం. రాక్షసులను మరోసారి పాలించనివ్వబోం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినబూనారు. గత ప్రభుత్వ హయాంలో ఆలుమగలు (భార్యభర్తలు) మాట్లాడుకునే పరిస్థితి ఉండేది కాదని గుర్తు చేశారు. అవి మాట్లాడుకోవడానికే భయపడే రోజులని, కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు పూర్తి స్వేచ్ఛతో బతుకుతున్నారని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో రూ.1,238 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా పాలన-ప్రగతి బాట బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఆరు గ్యారంటీల్లో కొన్నింటిని అమలు చేస్తున్నామని, దేనికైనా కొంత ఓపిక ఉండాలని, దశలవారీగా పథకాలను అమలు చేస్తామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వంద సీట్లు సాధించి మళ్లీ ప్రజా ప్రభుత్వం వస్తుందని భరోసా వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు ఉంటాయని, ప్రతిపక్షాలు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శాశ్వత శత్రువులు కాదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయాలకు అతీతంగా తమ ప్రభుత్వ పాలన ఉంటుందన్నారు. "చట్టసభలు, బహిరంగ సభల్లో ప్రతిపక్ష నేతలకూ మాట్లాడే అవకాశం మా ప్రభుత్వం కల్పిస్తోంది. మా ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఈ సంస్కృతి ఉండేదా!?" అని ఆయన ప్రశ్నించారు.

**హామీలను నెరవేర్చేందుకే వచ్చాం**

"ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచే పీపుల్స్ మార్చ్‌ను ప్రారంభించారు. ప్రజల గుండెను తడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు.

మిగతా 2లో...

# ఒక్క రోజులో ఇరాన్‌ను అంతం చేస్తా



**ఆ దేశాన్ని ఒక్క రాత్రిలో ఆక్రమించుకోగలం.. ఆ పని నేటి రాత్రికే జరగొచ్చు**



**వాషింగ్టన్/ టెహ్రాన్, ఏప్రిల్ 6:** ఎన్ని డెడ్‌లైన్‌లు విధించినా ఇరాన్ కాల్పుల విరమణకు ఒప్పుకోకపోవటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ దిగిరాకపోతే ఒక్కరాత్రిలో ఆ దేశాన్ని పూర్తిగా ఆక్రమించుకోగలమని, ఒక్క రోజులో పూర్తిగా నాశనం చేయగలమని హెచ్చరించారు. ఆ పని మంగళవారం రాత్రే జరగొచ్చని అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ఇరాన్ నిరాకరించిన తర్వాత సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోవటం నన్ను నిరాశపర్చింది. ఇక ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఒక్క రాత్రిలో ఇరాన్ మొత్తాన్ని ఆక్రమించుకోగలం.. నాశనం చేయగలం. ఆ పని రేపు (మంగళవారం) రాత్రికే జరగొచ్చు' అని తెలిపారు. అమెరికా హెచ్చరి కలపై ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ తీవ్రంగా స్పందిం చారు. 'బెదిరింపులు, దాడులు, ఐఆర్‌జీసీ కమాండర్లను చంపటం ద్వారా మా సైనిక బలగాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. మా సైనికులు మరింత పౌరుషంతో పోరాడుతారు. మానవత్వంపై జరుగుతున్న ఈ దాడులకు అమెరికా, దాని మిత్ర దేశాలు తగిన మూల్యం చెల్లించక తప్పదు అని సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. యుద్ధానికి ముగింపు పలికేందుకు పది షరతులతో కూడిన సంధి ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా అమెరికాకు చేరవేసినట్లు ఇరాన్ అధికార వార్తా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. తాత్కాలిక కాల్పుల విరమణ శత్రువు బలం పుంజుకునేందుకు అవకాశం ఇస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భగే వ్యాఖ్యానించారు.

మిగతా 2లో...

# అమరావతే రాజధాని..

**చట్టబద్ధ రక్షణ ప్రక్రియ సంపూర్ణం**

**చట్టబద్ధ రక్షణ ప్రక్రియ సంపూర్ణం**

**రాష్ట్రపతి ఆమోద ముద్ర..**

**ఆ వెంటనే గెజిట్ నోటిఫికేషన్ జారీ**

**2024 జూన్ 2 నాటి నుంచే 'అమరావతి'**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6**
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ సంపూర్ణమైంది. ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పడింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు-2026 సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌కు చేరింది. సాయంత్రానికే దీనిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేశారు. రాత్రి 10 గంటలకల్లా 'గెజిట్ నోటిఫికేషన్' కూడా వెలువడింది. దీంతో 'అమరావతి'కి కేంద్ర స్థాయిలో చట్టబద్ధమైన రక్షణ లభించినట్లయింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర అనంతరం భారత ప్రభుత్వ కార్యదర్శి రాజీవ్ మణి ఈ గెజిట్‌ను విడుదల చేశారు. 2014నాటి రాష్ట్ర పునర్విభజన చట్టంలో... 'పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. ఆ తర్వాత ఏపీకి ఒక కొత్త రాజధాని ఉంటుంది' అని పేర్కొనగా... సవరణ చట్టంలో 'ఏపీకి అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అంటూ స్పష్టమైన వివరణ ఇచ్చారు. అలాగే సీఆర్డీయే చట్టం-2014 కింద నోటిఫై చేసిన ప్రాంతమంతా 'అమరావతి' పరిధిలోకి వస్తుందని మరో సవరణ చేశారు. వెరసి... 2024 జూన్ 2 నుంచే రాజధానిగా అమరావతి అమలులోకి వచ్చినట్లయింది. చకచకా అడుగులు..: రాజధాని అమరావతికి చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. ఈ ప్రక్రియ మరింత పకడ్బందీగా జరిగేలా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలని కేంద్రం సూచించింది.

# డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటే లక్ష్యం

**బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో రాంచందర్‌రావు**



**హైదరాబాద్, మార్చి6 :** రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటే తమ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రకటించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎ?సను రాష్ట్ర ప్రజలు మరచిపోయారని అన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను సోమవారం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ సామాన్య కార్యకర్తలే బలగంగా బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి మహనీయులు వేసిన పునాదులపై పార్టీ అప్రతిహతంగా దూసుకుపోతోందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత్ భారత్' నిర్మాణంలో భాగస్వాములు కావాలని పార్టీ కేడర్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఫోన్‌లో రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్ రావు, శాసనమండలిలో పార్టీ ఫ్లోర్ లీడర్ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు.

# 9 మంది పోలీసులకు మరణశిక్ష

**చెన్నై, ఏప్రిల్ 6**
తమ కస్టడీలో ఉన్న తండ్రి, కొడుకులను పోలీసులు అత్యంత పాశవికంగా కొట్టి హత్య చేసిన కేసులో తమిళనాడులోని మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన తొమ్మిది మంది పోలీసు అధికారులకు రెండేసి మరణశిక్షలు విధించింది. అంతేగాక బాధిత కుటుంబసభ్యులకు దోషులైన ఆ పోలీసు అధికారులు 1.40 కోట్ల నష్టపరిహారం కింద చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి జి.ముత్తుకుమరన్ సోమవారం తీర్పు ఇచ్చారు. ఇది అరుదైన కేసుల్లోనే అత్యంత అరుదైన కేసు అని ఈ సందర్భంగా జడ్జి వ్యాఖ్యానించారు.
శాంతిభద్రతలను రక్షించాల్సిన పోలీసులే చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏవిధమైన నేరచరిత్ర లేని తండ్రీ కొడుకులు జయరాజ్ (58), బెనిక్స్ (31)లను పోలీసులు కస్టడీలో దారుణంగా కొట్టారని చెప్పారు.

# త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు..!

**10 నుంచి 12 మందితో జాబితా సిద్ధం!**

**కొందరికి ఎఫ్ఏసీ, హోదాకు తగ్గ పోస్టింగుల్లో సర్దుబాట్లు**

**మరికొందరికి స్థాన చలనం**




**హైదరాబాద్, ఏప్రిల్ 6**
రాష్ట్రంలో త్వరలో మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు 10-12 మందితో జాబితా సిద్ధమవుతున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఇటీవలనే ప్రభుత్వం ఐఏఎస్‌లను బదిలీ చేసింది. అయితే అందులో కొందరికి పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ), మరికొందరికి హోదాకు తగ్గ పోస్టింగ్‌లు రాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఇంకొంత మంది పనితీరు విషయంలో ప్రభుత్వం అసహనంగా ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే హోదాకు తగ్గ పోస్టింగ్‌లు, ఒకటి, రెండు పోస్టింగ్‌ల్లో ఉన్న అధికారులకు ఒకే పోస్టింగ్ ఇవ్వడంతో పాటు పనితీరు బాగోలేని అధికారులకు స్థాన చలనం కలిగించనున్నట్టు తెలిసింది. ఎవరు ఏ విభాగం నుంచి, ఏ శాఖ నుంచి రిలీవ్ అవుతారోననే అంశంపై సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఓ శాఖకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదాలో ఉన్న ఐఏఎస్ అధికారి త్వరలో కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నట్టు తెలిసింది. రాష్ట్ర సర్వీసులోకి రాకముందు ఆయన కేంద్రంలోనే ఉన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం ఆయన్ను కీలక శాఖ నుంచి తప్పించి, వేరే శాఖకు బదిలీ చేయడం, అదే సమయంలో కేంద్రంలోనూ ఆయనకు సెక్రటరీ హోదా గుర్తింపు రావడంతో కేంద్ర సర్వీసులకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతినివ్వగానే ఆయన కేంద్ర సర్వీసులోకి వెళ్తారని, నీతిఆయోగ్‌కు వెళ్తారని సమాచారం.

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రిక
మంగళవారం, ఏప్రిల్ 7, 2026

# రాక్షసులను మళ్లీ...

(మొదటిపేజీ తరువాయి)

ఆనాడు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకే మళ్లీ పిప్రి గ్రామానికి వచ్చాం" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పుష్కరాల్లోపు బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి నది వెంట ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. ఎర్రబస్సు ఎరగని ఆదిలాబాద్ జిల్లాలో వచ్చే జూన్ 2వ తేదీలోపు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. "జిల్లాల సరిహద్దులను మార్చవద్దని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. 2029 మార్చి 31 వరకు మండలాలు, రెవెన్యూ డివిజన్లను మార్పు చేసే అవకాశం లేదు. ఆ తర్వాత కమిషన్ వేసి బోథ్‌తోపాటు ఇతర ప్రాంతాలను రెవెన్యూ డివిజన్‌గా మార్చే అవకాశం ఉంది" అని హామీ ఇచ్చారు. బతుకమ్మ పండుగకు గతంలో ఆడబిడ్డలకు పాలపిట్ట రంగు చీరలను పంపిణీ చేశామని, వచ్చే పండుగకు చిలుక పచ్చ రంగు చీరల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

**అంతరాలు లేని సమాజమే మా ప్రభుత్వ లక్ష్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

అంతరాలు లేని సమాజం కోసం రాష్ట్రవ్యాప్తంగా 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో అంతర్జాతీయ వసతులు, సౌకర్యాలను కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారు. పిప్రి బహిరంగ సభ ఏర్పాటు ఆలోచన ముఖ్యమంత్రిదేనని, అది తన ఆలోచన కాదని తెలిపారు. ఈ రాష్ట్రంలో పుట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పీపుల్స్ మార్చ్ సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకే పిప్రి గ్రామానికి మళ్లీ వచ్చామని చెప్పారు. పిప్రి నుంచి ఖమ్మం జిల్లా వరకు 1,400 కి.మీల మేర ప్రజలకు అనేక హామీలు ఇచ్చామని, వాటన్నింటినీ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి మానవత్వం ఉందని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తో 5 లక్షల జీవితా బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. తనతోపాటు సీఎం, క్యాబినెట్‌లో ఉన్న వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారేనని, పేదల సమస్యలు, బాధలన్నీ తెలుసని అన్నారు.

# పంట అమ్మకం దాకా రైతు వెంటే!




భారతదేశంలో రైతు కోసం కనీస మద్దతు ధర (మినిమమ్ సపోర్ట్ ప్రైస్--ఎమ్ఎస్‌పీ) ప్రకటించడం కొత్త విషయం కాదు. కానీ రైతు పంటను గిట్టుబాటు ధరకు నిజంగా కొనుగోలు చేయడం మాత్రం ఇప్పటికీ చాలా చోట్ల జరగడం లేదు. అందుకే ఈ రోజు రైతు అడుగుతున్న అసలు ప్రశ్న-- "ప్రభుత్వం ధరను మాత్రమే ప్రకటిస్తుందా? లేక రైతు పంటను నిజంగా కొనుగోలు చేస్తుందా?". ఈ ప్రశ్నకు తెలంగాణ ప్రభుత్వం తన చర్యలతో సమాధానం చెబుతున్నది. రైతు భరోసా, రుణమాఫీ, పంట నష్టం సహాయం, పంట బీమా, సన్న రకపు ధాన్యానికి బోనస్, మొక్కజొన్న-- జొన్నలకు ఎమ్ఎస్‌పీ కొనుగోళ్లు, మార్క్‌ఫెడ్ ద్వారా మార్కెటింగ్ భరోసా... ఇవన్నీ కలిపి చూస్తే తెలంగాణలో ప్రస్తుతం ఉన్నది కేవలం వ్యవసాయంపై మాట్లాడే ప్రభుత్వం కాదు-- రైతు పక్షాన నిలబడి, రైతు జీవితాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకున్న ప్రభుత్వం అన్నది స్పష్టమవుతున్నది. భారతదేశంలో వ్యవసాయంపై చర్చ జరిగేటప్పుడు చాలా సందర్భాల్లో మనం ఉత్పత్తి గురించే ఎక్కువగా మాట్లాడుతుంటాం. దిగుబడులు ఎలా పెంచాలి, మెరుగైన విత్తనాలు ఎలా అందించాలి, సాగునీరు ఎలా కల్పించాలి, యాంత్రీకరణ ఎలా తీసుకురావాలి... ఇవన్నీ అవసరమైన అంశాలే. కానీ రైతు జీవితాన్ని దగ్గరగా గమనించిన నాకు ఒక విషయం స్పష్టంగా తెలుసు-- రైతు అసలు సమస్య పంట పండించడం కాదు, పండించిన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడమే. ఒక రైతు విత్తనం వేస్తాడు. ఎరువు వేస్తాడు. కూలి ఖర్చు పెడతాడు. ప్రకృతి విపత్తులను, తెగుళ్లను, మార్కెట్ అనిశ్చితిని ఎదుర్కొంటాడు. కానీ చివరికి తన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడు సరైన ధర రాకపోతే, అతని కష్టం అంతా విలువ కోల్పోయినట్టే! అందుకే రైతు సంక్షేమం అంటే కేవలం పంట పండించే దశలో సాయం కాదు, పంట అమ్ముకునే దశలో కూడా ప్రభుత్వం రైతు పక్కన నిలవాలి. ఇదే తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ దృక్పథం. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అనేక పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తోంది. కనీస మద్దతు ధర ప్రకటించడం తప్పు కాదు. కానీ రైతు అడిగే అసలు ప్రశ్న ఏమిటంటే-- "ప్రకటించిన మద్దతు ధర రైతు చేతికి నిజంగా చేరుతోందా?" అన్నది. మద్దతు ధర కాగితాలపై ఉండొచ్చు. ప్రకటనల్లో ఉండొచ్చు. కానీ రైతు మార్కెట్ యార్డుకు వెళ్లినప్పుడు, అక్కడ వ్యాపారి తక్కువ ధర చెబితే, ప్రభుత్వ కొనుగోలు లేకపోతే ఆ కనీస మద్దతు ధర ఉపయోగం రైతుకు ఉండదు. అందుకే-- కనీస మద్దతు ధర అంటే కేవలం ప్రకటన కాదు, రైతు చేతికి అందే హామీ కావాలి. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం ఒక స్పష్టమైన మార్గాన్ని చూపుతోంది. ఈ రోజు దేశంలో చాలా రాష్ట్రాలు కనీస మద్దతు ధర గురించి మాట్లాడుతున్నాయి. కానీ తెలంగాణ మాత్రం కనీస మద్దతు ధరను రైతు జీవితంలో అమలయ్యే విధానంగా మార్చుతోంది. కేంద్ర ప్రభుత్వం ఠాతీఅివివ ఠాబజూజూశిఊ ఠాష్ట్రవఎివ (ఠూబా) కింద ప్రధానంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి కొన్ని పంటలకు మాత్రమే పరిమిత మద్దతు ఇస్తోంది. అంతేగాక, రాష్ట్రం మొత్తం ఉత్పత్తిలో కూడా కేవలం 25శాతం వరకు మాత్రమే కొనుగోలు చేసే పరిమితి ఉంది. అంటే కనీస మద్దతు ధర ప్రకటించినా, రైతులందరికీ పూర్తి రక్షణ ఉండదు. ఇక్కడే తెలంగాణ భిన్నంగా ఆలోచిస్తోంది. రైతు కోసం ధర ప్రకటించడం కాదు, రైతు పంటను కొనుగోలు చేయడం ముఖ్యం అని తెలంగాణ నిరూపిస్తోంది.తెలంగాణ ప్రభుత్వం రైతులకు కేవలం కనీస మద్దతు ధర మాత్రమే కాకుండా, సన్న రకపు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తూ గత రెండు సంవత్సరాలుగా అమలు చేస్తోంది. ఇది రైతుకు నేరుగా అదనపు ఆదాయం. దిగుబడిని బట్టి ఎకరాకు రూ.20,000 నుంచి రూ.25,000 వరకు అదనపు లాభం రైతులకు లభిస్తోంది. ఇది ఒక ముఖ్యమైన అంశం, ఎందుకంటే వ్యవసాయ విధానం కేవలం "ఎంత పండింది?" అన్నదానికే పరిమితం కాకూడదు. "రైతు చేతిలో ఎంత మిగిలింది?" అన్నదే అసలు ప్రశ్న. ఈ ప్రశ్నకు తెలంగాణ ప్రభుత్వం ఆచరణలో సమాధానం చెబుతోంది.

# ఒక్క రోజులో ఇరాన్‌ను..

(మొదటిపేజీ తరువాయి)

అంతకుముందు ఈజిప్టు, తుర్కియే, పాక్ దౌత్యవేత్తలు రూపొందించిన రెండు దశల కాల్పుల విరమణ ప్రతిపాదనలను ఇరాన్‌కు, అమెరికాకు అందజేశాయి. హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవాలన్న ప్రతిపాదనతోపాటు 15అంశాలు ఇందులో ఉన్నాయి. మొదటి దశలో 45రోజులపాటు తాత్కాలిక కాల్పుల విరమణను ప్రతిపాదించారు.

**ఐఆర్‌జీసీ నిఘా విభాగాధిపతి హతం**

చర్చలంటూనే అమెరికా-ఇరాన్ పరస్పరం భీకర దాడులు చేసుకొంటున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఇరాన్ రాజధానితోపాటు బహరెస్తాన్ జిల్లాలో అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దళాలు క్షిపణుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీ నిఘా విభాగం అధిపతి మాజిద్ ఖదేమీ, రహస్య దళం అధిపతి అస్గర్ బకేరీ సహా 25 మంది మర ణించారు. టెహ్రాన్‌లోని షరీఫ్ సాంకేతిక విశ్వవిద్యాలయంపై కూడా దాడి జరిగింది. ఇరాన్‌కు అత్యంత కీలకమైన సౌత్‌పార్స్ సహజవాయు క్షేత్రంలోని పెట్రోకెమికల్ ప్లాంటుపైనా బాంబు దాడి జరిగినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ కూడా ఖతార్, యూఏఈ, ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగించింది.

**భగ్గుమన్న చమురు ధరలు**

చర్చలకు ఇరాన్ ఒప్పుకోవటానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన 48 గంటల గడువు సోమవారం ముగియటంతో చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. జూన్ నెల కాంట్రాక్టుకు సంబంధించి ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్చేంజ్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర సోమవారం 110.58 డాలర్లకు చేరింది. మే నెల కాంట్రాక్టుకు సంబంధించి పశ్చిమ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర 111.90 డాలర్లకు పెరిగింది. ఆసియా దేశాల్లోని రిఫైనరీలకు సరఫరా చేసే తన లైట్ ముడి చమురు ధరను సౌదీ అరేబియా సోమవారం 19.50 డాలర్లు పెంచింది. దీంతో ఈ చమురు బ్యారెల్‌కు 109.12 డాలర్లకు చేరింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లో చిక్కుకుపోయిన తన ఎయిర్‌మెన్‌ను రక్షించేందుకు శనివారం రాత్రి అమెరికా చేపట్టిన అతిపెద్ద ఆపరేషన్‌పై ఇరాన్ అనుమానాలు వ్యక్తంచే సింది. తన సైనికుడిని రక్షించుకొనే ఆపరేషన్ ముసుగులో తమ వద్ద ఉన్న యురే నియంను కొట్టేయాలని అమెరికా కుట్ర చేసిందని ఇరాన్ ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి.

**మళ్లీ తెరపైకి నేవీ సీల్ టీం 6**

ఇరాన్‌లో అమెరికా వైమానిక దళ ఎయిర్‌మెన్‌ను రక్షించేందుకు ఆ దేశం చేపట్టిన ఆపరేషన్‌లో అత్యంత సుశిక్షితులైన నేవీ సీల్ టీం 6 సైనికులు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. రహస్యంగా ఉండే ఈ దళం.. అత్యంత ప్రమాదకరమైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించటంలో పేరు పొందింది. 2011, మే 2న పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో అల్ కాయిదా అధినేత ఒసామాబిన్ లాడెన్‌ను మట్టుబెట్టింది కూడా ఈ టీం సభ్యులే. సీల్ టీం 6 చేపట్టిన ఆపరేషన్లపై హాలీవుడ్‌లో సినిమాలు కూడా వచ్చాయి.

**ట్రంప్... ప్లీజ్ మాట్లాడవా...**

హోర్ముజ్ జలసంధి, యుద్ధ విరమణపై ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతుండటంపై ఇరాన్ సెటైర్లు వేసింది. పలు దేశాల్లోని ఇరాన్ రాయబార కార్యాలయాలు సోషల్‌మీడియా వేదికగా ట్రంప్‌ను ఎగతాలి చేశాయి. హోర్ముజ్ జలసంధిని తెరిపించాలని పలు దేశాలను ట్రంప్ అడుగుతున్నట్లు.. రూపొందించిన ఓ సందేశాన్ని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ పోస్ట్ చేసింది. అందులో 'హోర్ముజ్ జలసంధిని తెరవండి' అని ట్రంప్ అడగ్గా.. 'దానిని మూసివేశారా' అని భారత్, పాక్.. 'తెరిచే ఉంది.. ఇప్పుడు మేము అక్కడి నుంచే బయటకు వచ్చాం' అని చైనా సమాధానమిస్తున్నట్లు ఉంది. 'ట్రంప్.. ప్లీజ్ మాట్లాడవా..! బోర్ కొడుతోంది' అని జింబాంబ్వేలోని ఎంబసీ సెటైర్ వేసింది. 'హోర్ముజ్ జలసంధి తాళంచెవులు ఎక్కడో పోయాయి' అని మరో ట్వీట్ చేసింది.

# 2 రాష్ట్రాల్లో గాలి మార్పు

**తమిళనాట ఎన్‌డీఏ, కేరళలో యూడీఎఫ్ విజయం?.. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ ఖాయం!**

**బెంగాల్లో స్వల్ప ఆధిక్యంలో టీఎంసీ**

**'మ్యాట్రిజ్' సర్వే సంస్థ సర్వేలో వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారే అవకాశం ఉందని మ్యాట్రిజ్ సర్వే సంస్థ తెలిపింది. తమిళనాడులో అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్‌డీఏ, కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నట్లు వెల్లడించింది. పశ్చిమ బెంగాల్లో పాలక టీఎంసీ, విపక్ష బీజేపీ మధ్య హోరాహోరీ నెలకొన్నా.. సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీయే స్వల్పంగా ముందంజలో ఉందని.. అసోంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ వరుసగా మూడోసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సృష్టించబోతోందని అంచనా వేసింది. ఈ నాలుగు రాష్ట్రాలపై తన తాజా సర్వే అంచనాల ఫలితాలను మ్యాట్రిజ్ సోమవారం విడుదల చేసింది.

**బెంగాల్.. టీఎంసీకి అత్తెసరే!**

బెంగాల్లో టీఎంసీ, బీజేపీల మధ్య ఓట్ల తేడా రెండు శాతమేనని మ్యాట్రిజ్ సర్వే వెల్లడించింది. 294 స్థానాల అసెంబ్లీలో మేజిక్ మార్కు 148 కాగా.. టీఎంసీకి 140-160 సీట్లు.. బీజేపీకి 130-150 రావచ్చని మేట్రిజ్ అంచనా వేసింది. 2021 ఎన్నికల్లో టీఎంసీ 215 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 77 సీట్లల్లో గెలిచింది. అయితే, ఈ దఫా బీజేపీ టీఎంసీతో ఢీ అంటే ఢీ అంటోందని.. టీఎంసీకి 43 శాతం ఓట్లు, బీజేపీకి 41 శాతం ఓట్లు లభిస్తాయని సర్వే వెల్లడించింది. ఓట్ల తేడా తక్కువగా ఉన్నందున బీజేపీ సంచలన విజయం నమోదుచేసినా చేయవచ్చని తెలిపింది.

**తమిళనాట డీఎంకే కూటమికి కష్టకాలమే!**

తమిళనాడులో ఈసారి గాలి మార్పు ఖాయమని మ్యాట్రిజ్ అంచనా వేసింది. సీఎం ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని పాలక డీఎంకే కూటమి ఏకపక్ష విజయం సాధిస్తుందన్న అంచనాలు తల్లకిందులయ్యాయని.. ఆ కూటమి గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోందని.. విపక్ష అన్నాడీఎంకే కూటమి (ఎన్‌డీఏ)తో హోరాహోరీ తథ్యమని.. ఎన్‌డీఏ వైపే మొగ్గు కనబడుతోందని తెలిపింది. ఎన్‌డీఏ 40 శాతం ఓట్లు సాధిస్తుందని.. డీఎంకే కూటమి 38 శాతంతో సరిపెట్టుకుంటుందని వెల్లడించింది. సినీహీరో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ప్రభావం బాగానే ఉంటుందని.. ఆ పార్టీ 16 శాతం ఓట్లు సాధించే అవకాశం ఉందని అంచనా వేసింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 158, అన్నాడీఎంకే కూటమి 67 చోట్ల విజయం సాధించాయి. 230 స్థానాల అసెంబ్లీలో మ్యాజిక్ మార్కు 116 కాగా.. ఈ సారి ఎన్‌డీఏ 107-120 స్థానాలు గెలుచుకుంటుందని.. డీఎంకే కూటమికి 102-115 స్థానాలు దక్కవచ్చని.. టీవీకేకి 5-12, ఇతరులు 1-6 సీట్లు గెలవొచ్చని పేర్కొంది. .

**కేరళలో యూడీఎఫ్**

కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పదేళ్ల తర్వాత కేరళలో అధికారంలోకి రానున్నట్లు మ్యాట్రిజ్ అంచనా వేసింది. ఈ కూటమి పాలక ఎల్‌డీఎఫ్ కంటే స్వల్ప ఆధిక్యంలో ఉందని తెలిపింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 140 స్థానాలకు గాను ఎల్‌డీఫ్ 99 చోట్ల గెలవగా.. యూడీఎఫ్ 41 స్థానాలకే పరిమితమైంది. కేరళలో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ మార్కు 71. ఈసారి యూడీఎఫ్ కూటమికి 67-73సీట్లు రావచ్చని.. ఎల్‌డీఎఫ్ 62-68 సీట్లు కైవసం చేసుకునే అవకాశం ఉందని మ్యాట్రిజ్ సర్వే తెలిపింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏకి 5-8 సీట్లు.. ఇతరులు 0-3సీట్లు సాధించే వీలుందని వెల్లడించింది. ఓట్ల పరంగా యూడీఎఫ్ 42 శాతం, ఎల్‌డీఎఫ్ 39 శాతం, ఎన్‌డీఏ 15 శాతం దక్కించుకోవచ్చని అంచనా వేసింది.

**అసోం.. మళ్లీ ఎన్‌డీఏదే**

సీఎం హిమంత సారథ్యంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అసోంలో హ్యాట్రిక్ సాధించే అవకాశాలున్నాయని మ్యాట్రిజ్ తెలిపింది. 126 స్థానాల అసెంబ్లీకి 2021లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ 75 చోట్ల విజయం సాధించగా.. కాంగ్రెస్ కూటమి 50 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. ఈసారి ఎన్‌డీఏకు 92-102 స్థానాలు వస్తాయని.. కాంగ్రెస్ కూటమి 22-32 సీట్లకే పరిమితమవుతుందని తెలిపింది. ఎన్‌డీఏ 46 శాతం ఓట్లు సాధిస్తుందని పేర్కొంది.

# కేంద్ర హోంశాఖ కార్యదర్శి మా ముందు హాజరవ్వాలి

**ఠాణాల్లో సీసీ కెమెరాలపై సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** దేశంలోని పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు విషయంలో తగిన సాయం అందించడానికి తమ ముందు హాజరుకావాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శిని సుప్రీం కోర్టు ఆదేశించింది. మంగళవారం వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేసింది. చాలా ఠాణాల్లో సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదంటూ పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా తీసుకున్న కోర్టు.. తాజాగా మరోసారి విచారణ చేపట్టింది. మానవ హక్కుల ఉల్లంఘనలు అరికట్టడానికి అన్ని ఠాణాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలంటూ 2018లోనే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇక భద్రతా సమస్యలను కారణంగా చూపి పలుచోట్ల చైనా సంస్థకు చెందిన సీసీ కెమెరాలను తొలగించారన్న ఇటీవలి మీడియా కథనంపై కేంద్రం తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే ఈ విషయంలో కేంద్రం ఎటువంటి అధికారిక ఉత్తర్వులు జారీ చేయలేదని అదనపు సొలిసిటర్ జనరల్ రాజా చెప్పారు.

# పదవి బాధ్యతలు చేపట్టిన చైర్మెన్, వైస్ చైర్మెన్









**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 06, (మన సమాజం):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మెన్ గొడిసేల సంధ్యారాణి – రాజరమేష్, వైస్ చైర్మెన్ మిట్టపల్లి సరిత – శ్రీనివాస్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. స్థానిక రామాలయం చౌరస్తలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సూపర్ బజార్, బిజోన్ సెంటర్, రాజీవ్ చౌక్ మీదుగా సంబరాలు చేసుకుంటూ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం చేరుకున్నారు. మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ స్వాగతం పలకగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ చైర్మెన్, వైస్ చైర్మెన్ సీట్లలో వారు ఆసీనులైనారు. కూటమి కౌన్సిలర్లు, నాయకులు, అభిమానులు, సిబ్బంది ఛైర్మెన్ వైస్ చైర్మెన్ లను ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు చేస్తామని, అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోనే మున్సిపాలిటీని మొదటి స్థానంలో నిలపడానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

**నృత్యాలు చేసిన కౌన్సిలర్లు..**

కౌన్సిలర్లుగా గెలుపొంది చైర్మెన్ ఎన్నిక రోజున పట్టణంలో అడుగుపెట్టిన కూటమి కౌన్సిలర్లు విజయోత్సవ ర్యాలీకి దూరమైన విషయం తెలిసిందే. చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక అనంతరం పదవి బాధ్యతలు చేపట్టే తరుణంలో కూటమి కౌన్సిలర్లు ఆనందోత్సాహంలో తేలుతూ స్థానిక రాజీవ్ చౌక్ లో నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంభగోని సుదర్శన్ గౌడ్, రామడుగు లక్ష్మణ్, బిఆర్ఎస్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాసర అమ్మవారి సన్నిధిలో
# రేవంత్ రెడ్డి మనవడికి అక్షరాభ్యాసం

**- కుటుంబ సమేతంగా జ్ఞాన సరస్వతిని దర్శించుకున్న సీఎం - ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన ముందు ప్రత్యేక పూజలు**

**మనవడికి అక్షరాభ్యాసం చేయించి మొక్కులు తీర్చుకున్న రేవంత్ రెడ్డి**





**నిర్మల్, ఏప్రిల్ 06**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ఆయన, తొలుత అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, విద్యార్థులకు జ్ఞాన ప్రదాత అయిన సరస్వతీ దేవి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రార్థించారు.అమ్మవారి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. బాసర క్షేత్రం అక్షరాభ్యాసానికి అత్యంత ప్రశస్తమైనది కావడంతో, కుటుంబ సభ్యుల సమక్షంలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారి చేత ఓంకారమును దిద్దించి, విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఈ అపూర్వ ఘట్టాన్ని చూసేందుకు ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు మరియు పార్టీ శ్రేణులు ఆసక్తి కనబరిచారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా సామాన్య భక్తుడిలా తన మనవడి విద్యా ఆరంభాన్ని బాసరలో జరిపించడం విశేషం.అక్షరాభ్యాసం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రికి వేద పండితులు ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రాన్ని కప్పి రేవంత్ రెడ్డిని గౌరవించారు. తన మనవడి విద్యాభ్యాసం బాసర అమ్మవారి చెంత జరగడం పట్ల ముఖ్యమంత్రి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి విద్యాబుద్ధులు ప్రసాదించే జ్ఞాన సరస్వతి ఆశీస్సులు తన కుటుంబంపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ క్రతువు ముగిసిన వెంటనే ఆయన ఆలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సతీమణి మరియు ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రాకతో బాసర ఆలయ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అక్షరాభ్యాసం కోసం వచ్చిన ఇతర భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సీఎం కుటుంబం వేడుకలో పాల్గొంటుండగా భక్తులు జయజయధ్వానాలు చేశారు.ముఖ్యమంత్రి పర్యటనతో బాసర క్షేత్రంలో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. రూ. 225 కోట్లతో చేపట్టనున్న ఆలయ పునరుద్ధరణ పనులకు ఈ పూజలు ఒక శుభారంభంగా నిలిచాయని భక్తులు అభిప్రాయపడ్డారు. సొంత కుటుంబ వేడుకను ఆలయ అభివృద్ధి కార్యక్రమంతో జత చేయడం ద్వారా రేవంత్ రెడ్డి బాసర క్షేత్రంపై తనకున్న భక్తిని మరియు నిబద్ధతను చాటుకున్నారని స్థానికులు కొనియాడారు. ఈ పర్యటన ద్వారా బాసర అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని అంతా ఆశిస్తున్నారు.




# డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త టెస్ట్!

**లెర్నింగ్ లైసెన్స్‌కు ముందు ఆన్‌లైన్ పరీక్ష ..**

**దాంట్లో పాసైతేనే లెర్నింగ్, శాశ్వత లైసెన్స్**



**హైదరాబాద్, ఏప్రిల్ 6**

రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా అతివేగం, నిర్లక్ష్యం, రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన లేకుండా వాహనాలు నడుపుతుండటం వల్ల జరుగుతున్నవే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య లక్షకుపైగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో, యాక్సిడెంట్ల నివారణకు వీలుగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్సు జారీలో మూడంచెల విధానం అమల్లోకి తేవాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాల్ని పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించేందుకు రవాణాశాఖలో వివిధ విభాగాల నుంచి ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసారు.


# పేరుమార్పుతో సరా

వలసపాలనాకాలపు వాసనలను వదిలించుకొనే పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. గవర్నర్ల అధికారిక నివాసం రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం నుంచి సూచన పేరిట ఆదేశాలు అందడంతో రాష్ట్రాలు ఆ పనిలో ఉన్నాయి. పేరులో ఏమున్నది, మార్చితే పోయేదేమున్నది అనుకోవచ్చును గానీ, అంతా పేరులోనే ఉందని అనుకోబట్టే కేంద్రం ఈ పథకాన్ని ప్రకటించినమాట నిజం. పేరు మార్చినంతనే ప్రయోజనం లేదు, పేరు కాదు, ముందు బుద్ధి మారాలి, మీ తీరుమారాలి అని తమిళనాడు పాలకుడు స్టాలిన్ వంటివారు గిల్లుతున్నారు కానీ, పేరు మార్పుతో తమకు మరింత మన్నన దక్కుతుందని, రాజకీయ పెన్నిధి సమకూరుతుందని బీజేపీ నమ్ముతోంది. కొత్త నామఫలకం తీర్చిదిద్దిన ఆ భవనంలో ఇకముందు కూడా ఉండేది, ఉండబోయేది ఆ గవర్నరే. మారింది నివాసం పేరే కానీ ఆ వ్యవస్థ కాదు. గవర్నర్ వ్యవస్థే బ్రిటిష్ వలసపాలనా కాలం అవశేషం. బ్రిటిష్‌కాలంలో గవర్నర్లంటే అధికారం, అహంకారం, అణచివేత, అమానుషత్వాల కలబోత. ఆ వ్యవస్థను మనం ఇంకా కొనసాగించుకుంటూ, మరోపక్క కేవలం పేరుమార్చడం ద్వారా అది ప్రజలపక్షమని సందేశం ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. రాజ్ స్థానంలో లోక్ అనడం ద్వారా దీనిని జనభవనంగా జనులందరూ విశ్వసించాలని కేంద్రం ఆలోచన కావచ్చు. బాగానే ఉంది కానీ, జనంతో ప్రత్యక్ష సంబంధం లేని, వారు నేరుగా ఎన్నుకోని, ఇంకా చెప్పాలంటే ప్రజలకు పరిచయం కూడా లేని గవర్నర్ అధికారిక నివాసాన్ని ప్రజాభవనంగా నామకరణం చేయడంలో ఔచిత్యమేమిటని లోకుల అనుమానం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇష్టాయిష్టాలకు అనుగుణంగా, తమకు నచ్చినవారిని, సైద్ధాంతికంగా తాము మెచ్చినవారిని ఈ పదవిలో నియమిస్తుంది. వారు మేధావులు కావచ్చు, సకలవిద్యాపారంగతులు కావచ్చును కానీ, ప్రధానంగా ప్రధాని ఎంపికలో తమ మాట వినే లక్షణం పనిచేస్తుంది. ఆయన సూచనమేరకు రాష్ట్రపతి వద్దు కాదు లేదు వంటి సంశయాలకు తావు ఇవ్వకుండా ఆ నియామకాలు జరుపుతారు. రాష్ట్రపతికి నచ్చినంతకాలం గవర్నర్లు పదవిలో ఉంటారు తప్ప, ప్రజలు మెచ్చినంతకాలం కాదు. తన నియామకంతో సంబంధంలేని ప్రజలకు సహజంగానే గవర్నర్ జవాబుదారీ కాదు. వారు తనకు ఓటువేయరు కనుక, నేరుగా బాధ్యత వహించాల్సిన బాధ కూడా లేదు. ఆయన జవాబు చెప్పుకోవాల్సింది రాష్ట్రపతికీ, కట్టుబడాల్సింది రాజ్యాంగానికే. ప్రజలు ఎన్నుకొనే పార్టీలు, అవి ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, మంత్రివర్గాలు మాత్రం ప్రజలకు తలవంచాలి, శాసనసభకు జవాబు చెప్పుకోవాలి, ప్రజాభీష్టానికి తలొగ్గాలి. కేవలం సమన్వయకర్తగా, కేంద్రం దూతగా, నామమాత్రపు పాలకుడుగా ఉంటున్న గవర్నర్ ఇంటిని జనభవనం అనడం జనానికి సరైనదిగా కనిపించడం లేదు. విపక్షాల విమర్శలను అటుంచితే, కేంద్రం ప్రతిపాదించిన ఈ మార్పుకు పౌరసమాజం నుంచి, సామాన్యజనం నుంచి సానుకూల స్పందన రాకపోవడానికి కారణం గవర్నర్ వ్యవస్థ పనితీరు. అస్మదీయులే గవర్నర్లుగా నియమితులవుతారు కనుక డబుల్ ఇంజన్ సర్కార్లకు ఏ సమస్యా రాకపోవడం సహజం. కానీ, విపక్షపార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు మరొక ప్రత్యామ్నాయ పాలనావ్యవస్థగా తయారై, ఎలా వ్యవహరిస్తున్నారో చూస్తున్నాం. తమిళనాడు నుంచి పశ్చిమబెంగాల్ వరకూ గవర్నర్లు తామే ప్రతిపక్షంగా, ప్రతిపక్షనాయకుడిలాగా వ్యవహరిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను విమర్శించడం, ఘర్షణపడుతూండటం, బిల్లులను తొక్కిపెట్టి, ఎటూ తేల్చకుండా వదిలేసి పాలనను స్తంభింపచేయడం గమనిస్తున్నాం. 'రాజ్' అన్నది రాజరికాన్నో, బ్రిటిష్ రాజ్యాన్నో ప్రతిబింబిస్తున్నదని, గవర్నర్‌ను అలా చూడటం, ఆయన నివాసాన్ని రాజభవనం అనడం తగదని కేంద్రం అనుకుంటున్నందుకు సంతోషించాల్సిందే. అది పాలకుడి భవనం కాదు, ప్రజల భవనమనీ, ప్రజాసేవకుడి భవనమనీ కేంద్రం సందేశాన్ని ఇవ్వదల్చుకున్నందుకు మెచ్చాల్సిందే. తదనుగుణంగా ఈ అమృతభారతంలో గవర్నర్ వ్యవస్థను ప్రజానుకూల, ప్రజాకేంద్రిత వ్యవస్థగా సరిదిద్దాలి. గవర్నర్ అధికారాలు, విధులు, బాధ్యతల్లో మార్పులేవీ లేకుండా, వారి వ్యవహారశైలి అలాగే కొనసాగుతూంటే, కేవలం ఇంటిపేరుకు జనాన్ని తగిలించినమాత్రాన వారు పండుగ చేసుకోలేరు. 'లోక్‌భవన్' అన్నందుకు ఆ మార్పు కనబడాలి.

# హామీ ఇచ్చారు నెరవేరుస్తారా

గత సాధారణ ఎన్నికల సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాజంపేట బహిరంగ సభలో హామీ ఇచ్చారు.

ఇప్పుడు వారు ముఖ్యమంత్రిగా, ఉప ముఖ్య మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తు న్నారు. అత్యంత క్లిష్టమైన సూపర్ సిక్స్ హామీలనే స్వల్ప వ్యవధిలో నెరవేర్చిన వీరు, ఈ హామీని కూడా కచ్చితంగా నెరవేరుస్తారని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలలో గంపెడు ఆశలు రేకెత్తాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే వారికి మళ్లీ ఆశాభంగం కలిగేటట్లు కనిపిస్తోంది. చరిత్రాత్మకంగా, మౌలికవసతుల పరంగా, నైసర్గికంగా జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలు కలిగిన రాజంపేట... గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. గతంలో జగన్మోహన్‌రెడ్డి రాజంపేటకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూ రు చేస్తున్నట్లు ముఖ్య మంత్రి హోదాలో ప్రకటించి, జీఓ కూడా విడుదల చేశారు. కానీ కొద్ది రోజులకే ఆ మెడికల్ కాలేజీని మదనపల్లికి తరలిం చారు. దానికి ప్రతిగా రాజం పేటను జిల్లా కేంద్రం చేస్తామని వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు కంటి తుడుపు మాటలు చెప్పారు. కానీ సుదూర ప్రాంతమైన రాయచోటిని జిల్లా కేంద్రం చేసింది వైసీపీ ప్రభుత్వం.



## పూజా స్థానంలో మమితా?

ప్రేమలు, డ్యూడ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మలయాళీ సోయగం మమితా బైజు. ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ చిద్విలాసంగా కనిపించే ఈ సుందరికి యువతలో మంచి ఫాలోయింగ్ ఉంది. సూర్య నటిస్తున్న తెలుగు సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా నటిస్తున్నదీ అందాల భామ. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ సొగసరి మరో భారీ ఆఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. శర్వానంద్-శ్రీనువైట్ల కాంబోలో తెరకెక్కనున్న 'జార్జ్‌క్రిష్' అనే రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో మమితాబైజు కథానాయికగా ఖరారైందని సమాచారం. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు చోటుండగా.. ఇప్పటికే ఓ నాయికగా రుక్మిణి వసంత్‌ను ఖరారు చేశారు. రెండో కథానాయిక ఎంపిక కోసం పూజాహెగ్డేతో పాటు పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు మమితాబైజుని ఖరారు చేశారని తెలిసింది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## మర్డర్ మిస్టరీ
# 'ఎమ్4ఎమ్'

జోశర్మ, సాంబీత్ ఆచార్య ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్



'ఎమ్4ఎమ్' (మోటివ్ ఫర్ మర్డర్). స్వీయ నిర్మాణ దర్శకత్వంలో మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన ఈ సినిమా మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శింపబడటం గర్వంగా ఉందని, ఆద్యంతం ఉత్కంఠను పంచే కథ, కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందించామని, మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందని దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: మోహన్ మీడియా క్రియేషన్స్, నిర్మాణం, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల.

## తమిళంలో 'కోర్ట్' రీమేక్



ప్రియదర్శి ప్రధాన పాత్రలో హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన కోర్ట్ రూమ్ డ్రామా 'కోర్ట్' తెలుగులో మంచి ఆదరణ సొంతం చేసుకుంది. హీరో నాని నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 50కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. రామ్ జగదీశ్ దర్శకత్వ ప్రతిభకు ప్రశంసలు దక్కాయి. తాజాగా ఈ చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేస్తున్నారు. తమిళ రీమేక్ హక్కులను సీనియర్ హీరో ప్రశాంత్ పొందారు. తమిళ వెర్షన్‌కు ఆయన దర్శకత్వం వహించడంతో పాటు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తమిళ వెర్షన్‌కు 'రంజన్' అనే పేరుని ఖరారు చేశారు. సీనియర్ నటి దేవయాని కూతురు ఇనియా ఈ సినిమా ద్వారా కథానాయికగా పరిచయం కాబోతున్నది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది.

## మా అంగీకారం తీసుకోవాల్సిందే!

ఎప్పుడూ ఏదో ఒక వ్యవహారంతో వార్తల్లో ఉండే తారాల్లో జాన్వీకపూర్ ఒకరు. నిజానికి సినిమాల కంటే సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ వార్తల్లో నిలుస్తుంటుంది జాన్వీకపూర్. రీసెంట్‌గా ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ల ప్రవర్తనపై ఈ అందాలభామ ఇరిటేట్ అయ్యింది. తను ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నదో కూడా చూడకుండా, ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ఫొటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయడంపై జాన్వీకపూర్ బాహాటంగానే భగ్గుమంది. 'అందంగా ఫొటోలు తీయడం ఓ కళ. అలాగే ఫొటోలకు ఫోజులివ్వడం కూడా కళే. అయితే దీనికి వేళాపాళా అవసరం. మేం సిద్ధంగా లేనప్పుడు, ఎలా పడితే అలా ఫొటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వల్ల.. నెటిజన్ల నుంచి విమర్శలు మేం ఎదుర్కోవలసి వస్తున్నది. 'హాట్‌గా లేదు.. అందంగా లేదు..' అంటూ వాళ్లు కామెంట్లు పెడుతుంటే, ఒక నటిగా నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించారా?. జిమ్‌కెళ్లినా, ఎయిర్‌పోర్ట్‌కెళ్లినా, ఏ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైనా ఈ పాపరాజీలు(ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్లు) మాత్రం మమ్మల్ని వదలడం లేదు. దయచేసి వారందరికీ నేను మనవి చేసేదొక్కటే. మా ఫొటోలు తీయండి. కానీ మా అంగీకారంతో తీయండి. మేం సిద్ధంగా లేనప్పుడు ఫొటోలు తీసి, మా అందానికి చెడ్డ పేరు తేవొద్దు.. ప్లీజ్' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ.

